


# అల్లుడా.. మజాకా!

ఇమంది రామారావు

**"ఏమండోయ్! ఫోను మీకే..పెద్దల్లుడు లైన్లో వున్నాడు" పార్వతి భర్తని పిలిచి అతని చేతికి ఫోనిచ్చి తప్పించుకుంది.**

రామనాధం గుండెల్లో రాయి పడింది. పెద్దెల్లుడసలే వ్యాపారస్థుడు. పెద్ద పండుగకు కోరికలు కూడా పెద్దవిగానే ఉంటాయి మరి. ముందుగా ఎందుకు ఫోన్ చేసినట్లో...ఏం టెండరు పెడతాడో ఏమో! గొణుక్కుంటూనే ఫోన్లో అది బైట పడకుండా జాగ్రత్త పడ్డాడు.

"హలో శంకరం..ఎలా వున్నావు బాబూ?"

"బావున్నాను మామయ్యా! అత్తమ్మేంటీ.. ఫోన్లో అయిదు నిముషాలయినా మాట్లాడకుండా పారిపోయిందీ! ఏదో పెద్ద జోకేసినట్లు ఫీలయ్యి విరగబడి నవ్వాడు. ఆ నవ్వు వింటుంటే రామనాధానికి నిలువెల్లా కంపరం పుట్టుకొచ్చింది. అయినా తమాయించుకున్నాడు.

"ఏదో పని హడావుడిలో వుంది. నువ్వవన్నీ పట్టించుకోవద్దుగానీ...అమ్మాయెలా వుంది బాబూ! పండుగకి ఎప్పుడొస్తున్నారు? నాల్రోజులు ముందు రండి. సరదాగా వుంటుంది!"

ఏదో మాట వరుసకలా అన్నాడు గానీ. పండక్కి పెద్దల్లుడ్నీ కూతుర్ని పిలవడం అస్సలిష్టం లేదు. మామగారి మాటలు వినడం తప్ప భావాలు తెలీని శంకరం తెగ మొహమాటపడిపోయాడు. భార్య ఉమని పిలుస్తూ "ఇదిగో మీ అమ్మాయొచ్చింది. ఉమతో మాట్లాడండి!" అంటూ ఫోను ఉమ చేతికందించాడు.

"హలో నాన్నా!"

'ఏం పాపా! ఎలా వున్నావమ్మా? కూతురు పలకరింపు వినగానే పరవశించిపోయాడు.

"ఇక్కడ మేం బావున్నాం నాన్నా! అమ్మెలా వుంది?"

"ఓహ్...ఫస్ట్ క్లాస్!"

"నీ ఆరోగ్యం ఎలా వుంది నాన్నా!"

"అదీ ఫస్ట్ క్లాస్!"

"మీ అల్లుడు..మారుతీ జెన్ కొంటానని ఒకటే పేచీ పెట్టేస్తున్నారు నాన్నా!" కూతురు గొంతులో కొండంత దిగులు ధ్వనించింది.

"శుభం! ఇంకా ఆలస్యమెందుకూ... కొనెయ్యమని చెప్పూ!"అన్నాడు రామనాధం హుషారుగా.

"మొన్ననే కారు చూశారు! లక్షా ఎనభై వేలు చెప్పారు. మంచి కండీషనులో వుంది. ఈయన దగ్గర ఎనభై వేలున్నాయి. ఇంకో లక్ష రూపాయలు సర్దమంటున్నారు!" తటపటాయిస్తూనే మొత్తం విషయం చెప్పేసింది ఉమ.

రామనాధానికి గొంతులో వెలక్కాయ పడ్డట్టయ్యింది.

"ఏం నాన్నా! మాట్లాడవూ?"

"మాట్లాడ్డానికేం వుందమ్మా... నువ్వు చెప్పావు. నేను విన్నాను. జరగవలసిందేదో ఆ భగవంతుడి చిత్తం...మన ప్రాప్తం. మీకు ఫోను బిల్లెక్కువవుతుంది. ఫోను పెట్టేస్తున్నాను!" అవతల సమాధానం కోసం ఎదురు చూడకుండా ఫోను పెట్టేశాడు రామనాధం.

"అయ్యో రాతా! అదేవిటండీ? అమ్మాయి మాట్లాడుతుంటే ఫోను పెట్టేశారూ?" నిష్ఠూరంగా అడిగింది పార్వతి.

"అవతల నీ కూతురు ఫోన్లో ఏం మాట్లాడిందో విన్నావా?"

"ఏమంది?"

"నిన్నో లక్ష రూపాయలు సర్దమంది!"

"లక్ష రూపాయిలా!"

"పెద్దల్లుడు మారుతీ జెన్ను కొంటాడట! జెన్ను!"

"జెన్ను కాకపోతే ఏరోప్లేను కొనుక్కోమని చెప్పండి. మన డబ్బుతో కొనుక్కోవడం దేనికీ?"

"అల్లుడు కదా మరి!"

"మూడేళ్ళ క్రితం పెళ్ళయిన పెద్దల్లుడే ఇలాంటి గొంతెమ్మ కోరికలు కోరితే కిందటేడు పెళ్లయిన చిన్నల్లుడు అందునా కొత్తల్లుడు ఇంకేం కోరతాడో...?"

"ఏం కోరతాడూ...ఏ మైసూరు పేలస్సో, రాయల సీమనో రాసిచ్చెయ్యమని చెబుతాడు. సిద్ధంగా ఉండూ!" రామనాథం ఉక్రోషంతో ఊగిపోతూ చిందులేశాడు. అల్లుళ్ళ పేరు చెబితేనే దడ పుట్టుకొస్తుంది.

రామనాథం చిందులేస్తే వెనకా ముందు చూడడు. కామాలూ ఫుల్‌స్టాపులూ అసలే వుండవు. ఓపికున్నంతవరకూ చరిత్ర తిరగేస్తాడు. అందుకనే సాధ్యమయినంత దూరంలో వుంటుంది పార్వతి.

మళ్ళీ ఫోను రింగయింది.

ఫోనుకేసి కోపంగా చూశాడు రామనాథం.

"ఆ మహానుభావుడేమోనే...ఇంట్లో లేరని చెప్పు. అమ్మాయి మాట్లాడితే పాపా నువ్వు ఫోన్ చేసిన తర్వాత మీ నాన్నకి బీపీ, షుగరూ పెరిగిపోయింది. హాస్పిటల్‌కి వెళ్ళారని చెప్పు!" ముందు జాగ్రత్తలు చెప్పాడు.

"హలో ఎవరండీ! రామూనా... ఏమండోయ్! మీ చిన్నల్లుడు రామం! రండి...రండి!" హడావుడి చేసేసింది పార్వతి.

పెద్దల్లుడి నిర్వాకం అయిపోయింది. ఇంక చిన్నల్లుడు రంగంలోకి దిగాడా? అయినా దీనికిదేం బుద్ధి? ఏదో ఒకటి సమాయనికి తగు పాట పాడి ఫోను పెట్టెయ్యొచ్చు కదా! మనసులోనే తిట్టుకుంటూ ఫోనందుకున్నాడు.

"హలో చినబాబూ! ఎలా వున్నారు బాబూ!" బలవంతంగా ప్రేమను కురిపిస్తూ అడిగాడు రామనాథం.

"బానే వున్నాం మావగారూ! మీరెలా వున్నారు?" చిన్నల్లుడు ఆప్యాయంగా అడిగాడు.

"ఏమిటి బాబూ విశేషాలు? పండుగకు ఎప్పుడొస్తున్నారు? మా చినపాప ఏమంటోంది?"

"ఇదిగో..మీ అమ్మాయితో మాట్లాడండి!" రాము భార్య జానకికి ఫోనందించాడు. రామనాథం నీరుగారిపోయాడు. పెద్ద కూతురో బాంబు పేల్చింది. చిన్న కూతురేం పేలుతుందో...అసలు బాంబే పేలుస్తుందో? మందుపాతరే పేలుస్తుందో...గొణుక్కుంటూ ఫోనులో ఆ చిరాకు కనబడనీయకుండా "చిన పాపా! బాగున్నావా?" ఆప్యాయంగా అడిగాడు రామనాథం.

"బావున్నాను నాన్నా! పండుగకు వారం రోజులు ముందుగానే వెళదాం అంటున్నారు మీ అల్లుడుగారు!"

"దాందేం భాగ్యం తల్లీ! రేపు బయలుదేరితే మాత్రం కాదనేవారెవరూ?"

"అది...నాన్నా!...మీ అల్లుడు గార్కి హైద్రాబాదులో ఏదో ముఖ్యమైన పనుందట. కనీసం వారం పదిరోజులు పడుతుందట. అందుకనే ముందుగా వస్తున్నాం...ముందుగా వస్తున్నాం అని చెప్పడానికి మీ అల్లుడు గారు మొహమాట పడిపోతున్నారు" తను మొహమాట పడిపోతూ చెప్పింది జానకి.

"దీనికి మొహమాటమెందుకమ్మా? ఇంతకీ ఏవంటారు అల్లుడుగారు?" క్లూ లాగడం కోసం ప్రయత్నించాడు రామనాథం.

"అది మాత్రం సస్పెన్స్‌గానే ఉంచమన్నారు. మేం వచ్చాక చెప్తాం...బై. ఉంటాం నాన్నా!" అంటూ అసలు విషయం చెప్పకుండా ఫోను పెట్టేసింది.

రామనాథం సోఫాలో కూలబడిపోయాడు.

"ఏమందండీ... ఎందుకలా నీరుగారిపోయారు?" కంగారు పడుతూ అడిగింది పార్వతి.


"ఏమంటుందీ...నీ పెద్దకూతుర్ని మించిపోయింది నీ చిన్నకూతురు! నీ పెద్ద కూతురు కనీసం ఫిగరయినా లక్షణంగా 'లక్ష' కావాలంటూ చెప్పింది. కానీ నీ చిన్న కూతురలా కాదే! ముందుగా ప్రోగ్రామ్ షెడ్యూలిచ్చింది. పది రోజులుంటారట. వారికేం కావాలో అల్లుడుగారు ఏం కోరుకుంటారో అంతా సస్పెన్సంట! ఇహ మనల్ని ఆ దేవుడే కాపాడాలి" నెత్తి మీద చేతులేసుకున్నాడు.

"ఇప్పుడేం చేద్దామండీ?"

"తూరుపు తిరిగి దండం పెడదాం. అంతకంటే మనం చెయ్యగలిగిందేం లేదు!"

## సన్నబడ్డ మనీషా!

**లే**టెస్ట్ ప్రియులతో నిత్యం సంచలనాలు సృష్టిస్తూ ఉండే నేపాలీ భామ మనీషా కొయిరాలా బాగా సన్నబడింది. కమల్‌హాసన్ సినిమా 'ముంబాయి ఎక్స్‌ప్రెస్'లో నటిస్తున్న ఈమె హఠాత్తుగా ఇంత సన్నబడి కనిపించడంతో పాత్ర పరంగా అలా తయారైందని భావిస్తున్నారు. ఈ విషయాన్ని మనీషా దగ్గర కదిపినా అమ్మడు ఏమాత్రం నోరు విప్పలేదు. 'చక్కనమ్మ చిక్కినా అందమే' అన్నట్లు మనీషా చిక్కినట్లు కనిపించినా అందంగానే ఉందని చూసినవాళ్ల గుసగుసలు!



మళ్ళీ మరోసారి చిందులేయడం మొదలు పెట్టాడు రామనాథం.

"ఇలా చిందులేస్తే మీ సమస్య పరిష్కారమవుతుందా?" అభ్యర్థనగా అడిగింది పార్వతి.

"పరిష్కారం కాకపోతే! కాలూ చేతులూ పీకుతాయి. ఒళ్ళంతా చెమట్లు పడతాయ్! పూర్తిగా అలసిపోతాను. ఆ తర్వాత దానంతట అదే నిద్రముంచుకొస్తుంది. తాత్కాలికంగా అదే ఈ సమస్యకి పరిష్కారం! నువ్వేం మాట్లాడకు! నన్ను మాట్లడనివ్వకు!" తలుపులు మూశాడు రామనాథం.

"కిటికీ తలుపులే వేసుకోకండి..ఎందుకైనా మంచిది!" నెమ్మదిగా అంది ఒక ప్రక్క భయపడుతూనే.

"అంటే నేను ఆత్మహత్య చేసుకుంటాననే కన్‌ఫర్మేషన్‌కి వచ్చేశావా? ఇవతల కాలిపోతోంది. కొరుకుతా...నరుకుతా...ఆc!" ఇంతెత్తుకి ఎగిరాడు రామనాథం. పార్వతి నెమ్మదిగా అక్కణ్నించి జారుకుంది లోలోపల పొంగుకొస్తున్న నవ్వాపుకుంటూ.

* * *

పెద్దల్లుడు శంకరం, పెద్ద కూతురు ఉమ పిల్లా పిచ్చుకా గొడ్డూగోదాతో సైతం వచ్చేశారు. 'సిటీకేబ్స్'కి బిల్లు పే చెయ్యడం దగ్గర్నుంచి మొదలయ్యింది వారి పండుగ ప్రహసనం. రామనాథం పచ్చనోట్లు మార్చడం మొదలు పెట్టాడు.

వారం రోజులు ముందు వస్తానని వార్నింగూ ప్లస్ చిన్న సస్పెన్సూ మిక్స్ చేసి మెసేజ్ ఇచ్చిన చిన్నల్లుడూ కూతురు రాలేదు. ఉరుములూ మెరుపులూ లేకుండా ఊడిపడ్డారు పెద్దల్లుడి బృందం సునామీ ఉప్పెనలా.

చెప్పొద్దూ! కూతుర్ని అల్లుణ్నీ మనుమల్ని చూడగానే సంబరపడిపోయింది పార్వతి. రామనాధానికి మాత్రం అరికాలి మంట నెత్తికెక్కింది.

"ఏం నాయనా! వ్యాపారం బాగా సాగుతోందా?" అన్నాడు. బైటికి మాత్రం 'నా బొంద బాగా సాగితే వారం రోజుల ముందే ఎందుకూడిపడతారూ?' మనసులో అనుకున్నాడు.

**(మిగతా 48 వ పేజీలో చూడండి)**

శంకరం మామగారి ధోరణి గమనించి "ఈ సూపర్ బజార్లొచ్చాక కిరాణా వ్యాపారస్థులందరూ బజారున పడ్డారు మామయ్యా? కొట్లో గుమస్తాని పెట్టాం! నమ్మకంగా చూసుకుంటాడు! కేవలం బోరుకొట్టి ముందుగా వచ్చాం! మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నామేమో!" అన్నాడు మాటవరుసకి మొహమాటం నటిస్తూ.

"ఇందులో ఇబ్బందేముంటుంది నాయనా! చాలా సంతోషంగా వుంది. మాకు కొడుకుల్లేరు. ఆ ముచ్చట తీరుతుంది" అన్నాడు ఆప్యాయంగా.

పార్వతి కాఫీలు పలహారాలు సిద్ధం చేసింది. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ పూర్తి చేశారు. మామా అల్లుళ్ళు ఒకరి మీద ఒకరు జోకులేసుకున్నారు. అలా నవ్వుతుంటే పార్వతికి ఎక్కల్లేని హుషారొచ్చేసింది. ఆ హుషారులో కూనిరాగాలు కూడా తన్నుకొచ్చాయి.

"నాన్నా! నేనడిగిందాని గురించి ఏం ఆలోచించావ్?" ఉమ మెరుపుదాడి చేసింది. రామనాథం షాక్ తిన్నాడు.

"దేని గురించమ్మా?" గుర్తు లేనట్లు అడిగాడు.

"అదే నాన్నా! ఈయనగారు జెన్ కొంటానంటున్నారు!"

"ఇంకేం భేషుగ్గా ఉంటుంది."

"ఆ లక్ష రూపాయిలూ..."నీళ్ళు నమిలింది ఉమ.

"ఉమా! బయటి వ్యక్తులకయితే మనింట్లో విషయాలు విడమరిచి చెప్పుకుంటాం. నీతో ఏం చెప్పను? చెప్పడానికి నీకు తెలీంది ఏముంది?" కూతురికి అర్థమయ్యే రీతిలో చెప్పాడు. దాంతో కూతురు నోటికి తాళం పడింది. అంతవరకూ నవ్వుతూ తుళ్ళుతూ

**అల్లుడా మజాకా! కథ**
**(39వ పేజీ తరువాయి)**

వున్న మామా అల్లుళ్ల మధ్య నిశ్శబ్దం ఆవహించింది.

"అయినా ఇప్పుడు జెన్నుతో పనేముంది బాబూ! నీకు ఫస్ట్‌క్లాసయిన కెనెటిక్ హోండా వుందిగా!" తనే కల్పించుకుంటూ అడిగాడు రామనాథం.

"నేను రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నాను మామయ్యా!" సీరియస్‌గా తన సంకల్పం చెప్పాడు.

"రాజకీయాల్లోకా? అది ఏ పనీ చేతగాని వాడు...ఎందుకూ కొరగాని వాడు చేసే పని కదు బాబూ!"

"నా పరిస్థితి అదే! అందుకే చేరాలనుకుంటున్నాను!"

"దానికి కారెందుకూ?"


"కారు లేకపోతే మనల్ని ఎవరు గౌరవిస్తారు మామయ్యా!"

"నువ్వన్నమాటే నిజమైతే చాలా మంది కారు మెకానిక్‌లు రాజకీయాల్లోకి చేరి వుండాల్సింది నాయనా! ఆ ఆలోచన విరమించుకో...నువ్వు కిరాణా వ్యాపారంలోనే వృద్ధిలోకి వచ్చావు. ఆ వ్యాపారాన్ని చూసే పిల్లనిచ్చాను. వున్న పళంగా నీ ఆలోచనలు మార్చుకుంటే ఎలా?"

"ఆలోచనలయితే అవి మార్చుకోగలను. కానీ ఇది నిర్ణయం మామయ్యా అది మారదు!" తెగేసి మరీ చెప్పాడు శంకరం.

నెత్తి మీద పిడుగు పడ్డట్లు ఫీలయ్యాడు రామనాథం.

ప్రతిరోజూ కారు గురించి కాసేపు గొడవ...అలకలు..అల్లుడు వెళ్ళిపోతానని




సూట్‌కేస్ సర్దుకోవడం మామగారు కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలడం నిత్యకృత్యం. ఇంకా సంక్రాంతి ఒక్క రోజే వుంది. అసలే అపార్ట్‌మెంట్స్‌లో ఉండటం వల్ల సందడి ఎక్కువగా వుంది. చుట్టాలూ, పక్కాలూ బంధువులూ ఇలా పిల్లా పాపలతో వెలిగిపోతోంది డ్రీమ్ ఎన్‌క్లేవ్. రామనాథానికి మాత్రం కాలిపోతోంది ఒక పక్క అల్లుడు మొండి పట్టు పట్టాడు. కాదంటే అమ్మాయిని తీసుకెళ్ళడం మానేస్తాడు. పిల్లల్నీ ఇక్కడే ఉంచేస్తాడు. అప్పుడేవిటి దారి? ఆలోచనలతో సతమతమైపోతున్నాడు. పార్వతి మాత్రం ఏం చేస్తారో మీ ఇష్టం అంటూ తప్పించుకుంది. ప్రస్తుతం తను ఆలోచిస్తుంది చిన్న కూతురు గురించే. "ఏవండీ! ఇంకా చిన్నమ్మాయి చిన్నల్లుడూ రాలేదేవండీ?"

"ఇంకా వాళ్ళొకటి తక్కువయ్యారా?!"

"అదేవిటండీ! కొత్తల్లుడూ పండక్కి రాకపోతే నలుగురూ ఏమనుకుంటారు? ఒకసారి ఫోన్ చేసి చూడండి" ఆశగా అడిగింది పార్వతి.

"నీకా భయమక్కర్లేదు. ఖచ్చితంగా వస్తారు. అతగాడూ ఏదో పెద్ద టెండరే పెడతాడు. మనం ఆ ప్లాట్లు అమ్ముకోవడం ఖాయం. బజారున పడ్డం అంతకంటే ఖాయం!" విసురుగా బాల్కనీలోకెళ్ళి వాలు కుర్చీలో కూలబడ్డాడు రామనాథం.

ఇంతలో రాము, జానకి వచ్చారు.


పెద్ద పెద్ద బ్యాగులూ...ఏదో దేశం వదిలిపోతున్నట్లనిపించింది ఆ లగేజీ చూస్తే. రామనాథం చూసీ చూడనట్లుగా ఊరుకున్నాడు.

"ఏమండీ! చిన్నమ్మాయీ, అల్లుడు వచ్చారండీ! ఏంటమ్మా! వారం రోజులు ముందుగా వస్తామని చెప్పి ఇపుడా రావడం? నిష్ఠూరంగా అడిగింది తల్లి.

"ఏం చెయ్యమంటావమ్మా! మీ అల్లుడిగారికి ఒక్క క్షణం తీరికుండదు. నాన్నేరీ?... నాన్నా!" బాల్కనీలోకొచ్చింది. రామనాథం కూతుర్ని చూసి..."జానకీ! ఇదేనా రావడం! ఏం బాబూ రామం ఎలా వున్నారు?" పెదవుల మీద నవ్వు బలవంతంగా పులుముకుంటూ అడిగాడు. ఉభయకుశలోపరి అయిపోయింది. తోడల్లుళ్లు ఇద్దరూ మాట్లాడుకున్నారు. అక్కాచెల్లెళ్ళిద్దరూ కబుర్లలో పడిపోయారు. వంటపని హడావుడిలో పార్వతి నిమగ్నమైపోయింది. రామనాథం ఇంటికావలసిన సరుకులు సమకూరుస్తున్నాడు గానీ, మనసంతా చిన్నల్లుడు పెట్టబోయే టెండరు మీదే వుంది. ఉండబట్టలేక చిన్నకూతుర్ని అడిగేశాడు.

## ఉచిత సలహాల నిధి!

సుస్మితాసేన్‌ని ఇప్పుడు అందరూ 'ఉచిత సలహాల నిధి' అని ముద్దుగా పిలుచుకుంటున్నారు. అడిగినా అడక్కపోయినా సుస్మిత 'ఉచిత సలహాలు' దంచేస్తోందట! సలహా చెప్పేముందు ఫలానా మనిషి నా సలహా వల్లే ఇంత స్థాయికి ఎదిగారు అని చెప్పి మరీ మొదలు పెడుతోందట! అమ్మడికి సినిమాల్లేకనే ఈ గొడవా అని చెవులు కొరుక్కునే వారూ లేకపోలేదనుకోండి!



"ఏదో సస్పెన్సన్నావూ... ఇపుడైనా చెప్పవా?"

"సస్పెన్సుని సస్పెన్సులాగే వుంచాలి నాన్నా! కంగారెందుకు?"

"నేను మెంటల్‌గా ప్రిపేరవ్వగలగాలి గానీ మెంటలెక్కి పోకూడదుగా!"

"అంత సీనేం ఉండదులే నాన్నా!" అంటూ జారుకుంది జానకి.

పెద్దల్లుడు పట్టిన పట్టు విడిచిపెట్టలేదు. ఉమ ఎటూ చెప్పలేని పరిస్థితి. పార్వతి నగలన్నీ ఒలిచి ఇచ్చేసింది. ఎంత బంగారం ధర ఎక్కువున్నా నలభై వేలు దాటదని చిన్నల్లుడు లెక్క చూసి చెప్పాడు. ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

పెద్దల్లుడు పండుగరోజునే సూట్‌కేస్ సర్దుకు బయలుదేరాడు.

ఉమ కాళ్ళా వేళ్లా పడి బ్రతిమాలింది.

"నీకు మొగుడు కావాలో తల్లిదండ్రులు కావాలో తేల్చుకో అని సినిమా డైలాగు చెప్పను! నువ్విక్కడే ఉండు. నీతో బాటు పిల్లలు కూడా వుంటారు. ఎప్పుడు లక్ష రూపాయలు తీసుకొస్తావో అప్పుడే నువ్వు నాకు పెళ్ళాం. వీళ్ళు నాకు పిల్లలు. లేకపోతే ఈ జన్మకింతే!" అన్నాడు శంకరం తిక్కశంకరయ్యలా కోపంతో వూగిపోతూ.

చిన్నల్లుడు అంతా విన్నాడు. పండుగ పూట జరిగిన జాతరకి జానకి సిగ్గు పడిపోయింది. ఉమ లోలోపల కుళ్ళికుళ్ళి ఏడుస్తోంది.

"పండుగ పూట ఇలా అల్లరి చేస్తే ఎలా అన్నయ్యగారూ! ఈ అపార్ట్‌మెంట్స్‌లో రేపు వాళ్ళు తలెత్తుకు తిరగొద్దూ!" రిక్వెస్టింగా అన్నాడు రాము.

"తల దించుకొని తిరగమని చెప్పు... నాకేం?"

"అది న్యాయం కాదు. పిల్లనిచ్చుకున్న అత్తమామల్నిలా ఏడిపించడం న్యాయం కాదు. భగవంతుడు మెచ్చడు. మరోసారి ఆలోచించండి!" అన్నాడు రాము ప్రాధేయపడుతూ. అత్తామామలు ఆశ్చర్యంగా రాముకేసి చూశారు. వారి కళ్ళలో రవంత తృప్తి.

"నీకేమయ్యా ముట్టచెప్పవలసినవన్నీ ముట్టచెప్పేశారు. నువ్వు కడుపు నిండి వున్నావు. నేను కడుపు మండి వున్నాను. దయచేసి మా విషయాల్లో తల దూర్చకు!" వార్నింగ్ ఇచ్చాడు శంకరం.

రాము తమాయించుకొంటూ "ఇది కుటుంబ విషయం. కుటుంబంలోనే పరిష్కారం కావాలి! నేనూ ఈ కుటుంబ సభ్యుల్లో ఒకడిగా చెప్తున్నాను. ఇది తప్పెలా అవుతుంది?"

"రామూ! యు ఆర్ టాకింగ్ టూమచ్!" ఉగ్రుడయ్యాడు.

"నో నో శంకరన్నయ్యా! నేను నా హద్దుల్లో ఉండే మాట్లాడుతున్నాను. మిమ్మల్ని హద్దులు దాటొద్దంటున్నాను. ఇకపోతే నేను ఇక్కడే హైద్రాబాద్‌లోనే మామగారింట్లోనే మామగారికి చేదోడు వాదోడుగా ఉందామనుకుంటున్నాను!" తన నిర్ణయం ప్రకటించాడు రాము అంతవరకూ మెంటైన్ చేసిన సస్పెన్స్‌ని బ్రేక్ చేస్తూ...

"ఇంకేం పెద్ద టెండరే పెట్టావూ?" శంకరం ఎత్తి పొడిచాడు.

"ఇది టెండర్ కాదన్నయ్యా! బాధ్యత! చిన్నప్పుడే తల్లీతండ్రినీ కోల్పోయిన నేను అత్తమామల ఆప్యాయతలో వారిని చూసుకున్నాను. నేను మిస్సయ్యాననుకున్న ప్రేమానురాగాల్ని పొందగలుగుతున్నాను. నేను చిన్నప్పట్నించీ కష్టపడే చదువుకున్నాను. పి.జి.చదువుకొన్నా కష్టపడ్డాను. ఈ రోజు నా కష్టార్జితం పది లక్షలు జమ చేయగలిగాను. హైద్రాబాద్‌లో స్వంతంగా వ్యాపారాన్ని డెవలప్ చేయాలనుకొని గత ఆరు నెల్లుగా స్టడీ చేయడం మొదలు పెట్టాను. నెట్‌వర్క్ పూర్తయింది. వ్యాపారంలో ఎలా లేదన్నా నెలకో యాభై వేలు కళ్ళ చూడొచ్చు. ఉద్యోగం చేస్తే ఇంతకంటే ఎక్కువ సంపాదించగలనని అనుకోవడం లేదు. ఇకపోతే మీరు లక్ష రూపాయలు అడిగారు. మామయ్యగారి పరిస్థితి తెలిసీ లక్ష రూపాయలు ఎలా వస్తాయని అడుగుతారు? అత్తమ్మ నగలు వలిచి తెగ నమ్మినా నలభై వేలు దాటవని నేనే చెప్పాను. మన పిల్లలకే ఇలాంటి పరిస్థితి తారసపడితే మనమేం చేస్తామో ఆలోచించు! అత్తా మామలైనా అల్లుళ్ళయినా ఎవరైనా ఒకరికొకరు కోరుకునేది మంచినే! మంచి జరగాలనే...! ఉద్యోగం కోసం ఆలోచించవలసినవాణ్ని వ్యాపారం చేయాలనుకుంటున్నాను. వ్యాపారం చేసి రాణించిన వాడివి, నీకిదేం రాజకీయాల పిచ్చి! ప్రజాసేవ చేసి ప్రజలకు దగ్గరవ్వాలి గాని, కారులో తిరిగితే దగ్గరవుతారా? మీరు వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తానంటే లక్ష కాదు, రెండు లక్షలిస్తాను. ఊరికే ఇవ్వను. ఇస్తే మీకు బాధ్యతుండదు. మీరు వ్యాపారంలో రాణించి ఇంతకు నాలుగింతలు సంపాదించాక నా డబ్బు నాకివ్వండి చాలు! ఆ సంపాదించే మార్గం కూడా నేనే చెప్తాను. సరేనా? ప్లీజ్ నన్నర్థం చేసుకోండి!" అన్నాడు రామం.

జానకి గర్వంగా భర్తకేసి తలెత్తి చూసింది. శంకరం సిగ్గుతో తల దించుకొని "సారీ తమ్ముడూ!" అన్నాడు.

"థ్యాంక్యూ బాబూ! థాంక్యూ వెరీ మచ్!" అంది ఉమ కృతజ్ఞతగా.

'యు ఆర్ గ్రేట్ హజ్బెండ్" అంది జానకి గర్వంగా ఫీలవుతూ.

"మీరు మాట్లాడరేం మామగారూ!" కావాలనే అడిగాడు రామం.

"మాటలు రావడం లేదు బాబూ! పెద్దవాడినైనా రెండు చేతులూ జోడించడం తప్ప నేను చేయగలిగిందేం లేదు. ఏవంటావు పార్వతీ!" అన్నాడు చెమర్చిన కళ్ళతో.

"నేనేమంటానండీ! ఇది నా జీవితంలో మరువలేని సంక్రాంతి. మనలాంటి తల్లిదండ్రులెందరో కోరుకున్న సంక్రాంతి!" అంది కృతజ్ఞత నిండిన కళ్ళను తుడుచుకుంటూ. ❀